మాట్లాడుతున్న కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషఖాన్

ఆర్టీసీ వరంగల్ రీజియన్ అగ్రగామిగా ఉండాలి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : వరంగల్ రీజియన్ అత్యధిక ఆదాయం సంపాదిస్తూ జోన్‌లో అగ్రగామిగా ఉండాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషఖాన్ అన్నారు. పదోన్నతిపై కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వచ్చిన ఖుస్రోషఖాన్ సోమవారం వరంగల్‌కు రాగా, రీజినల్ మేనేజర్ విజయభాను స్వాగతం పలికారు. అనంతరం ఆయన వరంగల్ రీజియన్ అధికారులతో సమావేశం నిర్వహించి అన్ని విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఖుస్రోషఖాన్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వరంగల్-2 డిపోలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమానికి హాజరై డిపోలోని స్టాఫ్‌తో సంభాషించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న డిపో సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఈడీ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఓ) భానుకిరణ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఎం) జీ.మాధవరావు, ఏవో రవీందర్, పీవో అర్పిత, వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు డిబార్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో ఆరుగురు, ఖమ్మం జిల్లాలోని పరీక్షా కేంద్రంలో ఒక్కరు ఉన్నారని, వీరిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : పద్మశాలి సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు దక్కింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అడ్వయిజర్‌గా బాల్నె సర్వేశం, అధికార ప్రతినిధులుగా కందగట్ల నరహరి, నామాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రుద్ర ఓం ప్రకాశ్, పెద్దూరి సంజీవరావు, రాష్ట్ర కార్యదర్శులుగా కూచన శ్రీనివాస్‌రావు, మర్త సారంగపాణి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గడ్డం రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా శ్రీరాముల శంకరయ్య, కోడాది కృష్ణ మోహన్‌ను నియమించారు. పద్మశాలీల ఐక్యతతో సమస్యల పరిష్కానికి కృషి చేస్తానని రాష్ట్ర అధ్యక్షుడు వల్లకటి రాజ్‌కుమార్ అన్నారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతిచెందిన బాలుడి కుటుంబసభ్యులు

ప్రైవేట్ ఆస్పత్రిలో బాలుడి మృతి

దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన

హనుమకొండ, డిసెంబర్ 2 : సుబేదారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం రామన్నకుంట తండాకు చెందిన గుగులోత్ భాస్కర్ (34), కుమారుడు తరుణ్ తేజ (6)కు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా, కుటుంబ సభ్యులు ఈ దవాఖానకు తీసుకెళ్లారు. అయితే బాలుడికి చికిత్స చేస్తున్నామని నమ్మించి చంపివేశారని సోమవారం కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు అక్కడికి చేరుకొని మాట్లాడుతున్న క్రమంలో తోపులాట జరిగింది. దీంతో ఆందోళన చేస్తున్న వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

భద్రకాళీ చెరువు పూడికతీత పనుల్లో వేగం పెంచాలి

నగరాభివృద్ధిపై ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి సమీక్ష

వరంగల్, డిసెంబర్ 2 : భద్రకాళీ చెరువు పూడికతీత పనుల్లో వేగం పెంచాలని, వచ్చే వర్షాకాలం నాటికి నీటితో నింపాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణితో కలిసి నగరాభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని 5 ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టాలన్నారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి ఎంజీఎం దవాఖాన రోడ్డు, హనుమాన్ ఆలయం నుంచి అలంకార్ జంక్షన్ రోడ్డు, కాంగ్రెస్ భవన్ నుంచి కేయూసీ రోడ్డు, అంబేద్కర్ జంక్షన్ నుంచి ఎన్జీవోస్ కాలనీ వరకు రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద తొలుత ఎంజీఎం హాస్పిటల్ నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయాలకు ప్రధాన కారణమైన చిరు వ్యాపారాల సముదాయాలను ఏకీకృతం చేయాలనే ఉద్దేశంతో రూ.9.40 కోట్లతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను అభివృద్ధి చేయనున్నామన్నారు. వచ్చే సంక్రాతి పండుగకు డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా సమాయత్తం కావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి

బల్దియా గ్రీవెన్స్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, డిసెంబర్ 2 : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వేగం పెంచాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆమె అర్జీలను స్వీకరించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 66 వినతులు అందగా వాటిలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 16, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం 6, ఆస్తి పన్నుపై 2, టౌన్ ప్లానింగ్ విభాగం 39, తాగునీటి సరఫరా 2, సాధారణ విభాగంపై ఒక వినతి అందినట్లు అధికారులు తెలిపారు. 26వ డివిజన్ పరిధిలోని 13వ బ్లాకులో హరిజన వాడకు చార్‌బౌళి వాటర్ ట్యాంకులో సాంకేతిక సమస్య కారణంగా వారం రోజులుగా తాగునీటి సరఫరా జరగడం లేదని, సరిచేయాలని అర్జీ అందజేశారు. పోగుల ఆగయ్య నగర్‌లో 13 సంవత్సరాలుగా మౌలిక వసతులు లేకపోవడంతో గుడిసెవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రం అందజేశారు. 16వ డివిజన్ పరమేశ్వర కాలనీ వాసులకు తాగునీటి సరఫరాలో అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 36వ డివిజన్ ఆర్ఎస్ నగర్‌లోని హిందూ శ్మశాన వాటిలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రేటర్ అడిషనల్ కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజిరెడ్డి, హెచ్‌వో రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనన్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో రాజేశ్ పాల్గొన్నారు.

బల్దియా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

అర్బన్ డే లో భాగస్వాములు కావాలి..

ప్రజా పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం అర్బన్ డే పేరిట నగరంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని కోరారు. నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వినయ్‌భాస్కర్‌తోనే కాజీపేట అభివృద్ధి

ప్రజల్లోకి వెళ్లలేకే ఎమ్మెల్యే నాయిని ఆరోపణలు : బీఆర్ఎస్ నాయకులు

మడికొండ, డిసెంబర్ 2 : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ప్రత్యేక కృషితో కాజీపేట అభివృద్ధి చెందిందని 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, సుంచు కృష్ణ, నార్లగిరి రమేశ్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత నాయిని రాజేందర్ రెడ్డి నగరానికి ఎలాంటి కొత్త ప్రాజెక్టును తీసుకు రాలేదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దాస్యం కాళోజీ కళాక్షేత్రం, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నయీంనగర్, ఫాతిమానగర్ బ్రిడ్జి విస్తరణ, వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులను నాయిని తన ఖాతాలో వేసుకుంటున్నారని, కాంగ్రెస్ విజయోత్సవాలు జరుగుతున్నందున ప్రజల్లోకి వెళ్లలేక వినయ్‌భాస్కర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాగన్ పరిశ్రమకు భూమి ఇచ్చింది.. నిధులు కేటాయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కాజీపేట చౌరస్తాలో తమతో సమానంగా నిలబడే హక్కు ఏ పార్టీ నాయకులకు లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్, రంజిత్‌కుమార్, శిరుమల్ల దశరథం, గబ్బెట శ్రీనివాస్, ఎండీ అష్జల్, ఎస్‌కే మహమూద్, బరిగెల వినయ్, బైరి ప్రభాకర్, సుంచు రఘురాం, సదరం మహేశ్, సుబ్బు పాల్గొన్నారు.

తేజస్వీ స్కూల్ మేనేజ్‌మెంట్ అత్యుత్సాహం

అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థితో అనుచిత ప్రవర్తన

న్యూశాయంపేట, డిసెంబర్ 2 : హంటర్ రోడ్డులోని తేజస్వీ పాఠశాలకు అయ్యప్ప మాల ధరించిన విద్యార్థి సోమవారం హాజరు కాగా, యాజమాన్యం అత్యుత్సాహం ప్రదర్శించిన ఘటన వెలుగు చూసింది. మాల వేసుకున్న విద్యార్థి పాఠశాల యూనిఫామ్ ఉంటేనే రావాలని హెచ్చరించి, పాఠశాలలోకి అనుమతించకుండా గంటపాటు తరగతి బయట నిలబెట్టడంతో పాటు బలవంతంగా ఆ విద్యార్థికి యూనిఫాం వేయించింది. నగరంలో ఈ విషయం వ్యాప్తి చెందడంతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ తీరుపై అయ్యప్ప భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. తేజస్వీ స్కూల్‌లో మొదటిసారి మణికంఠ మాలధారణలో ఉన్న 7వ తరగతి చదువుతున్న కన్నెస్వామిపై స్కూల్ యూనిఫామ్ వేయించిన పాఠశాల యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలలో ఉన్న కన్నెస్వామిని అవమానించడం బాధాకరమని ధర్మశాస్త అయ్యప్ప భక్త సేవాశ్రమ వ్యవస్థాపకులు టీఆర్ బాలసుబ్రహ్మణ్యం, గణపతి శర్మ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్కూల్ యాజమాన్యాన్ని హెచ్చరించారు.

ఇళ్లు కట్టిస్తామని రూ.24 కోట్లు దండుకుని దంపతులు పరార్..

నయీంనగర్, డిసెంబర్ 2 : ఇళ్లు కట్టిస్తామని చెప్పి ప్రజల వద్ద ఓ దంపతులు కోట్ల రూపాయలు దోచుకుని పరారైనట్లు సమాచారం. నగరంలోని గోపాలపురానికి చెందిన స్వామి, సునీత దంపతులు హైదరాబాద్, హనుమకొండలో ఇళ్లు నిర్మించి ఇస్తామని నమ్మబలికి రోజువారీ కూలీలు, మధ్య తరగతి కుటుంబాల వ్యక్తులకు మాయమాటలు చెప్పి సుమారు 118 మంది నుంచి రూ.24కోట్లు కాజేసినట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా, దంపతులపై గతంలో కూడా ఫిర్యాదులు వచ్చాయని, విచారణ చేపట్టి త్వరలోనే వారిని పట్టుకుంటామని చెప్పారు.

ఉచిత కోచింగ్ సెంటర్లను వినియోగించుకోవాలి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, డిసెంబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రంలో ఉచిత కోచింగ్ తీసుకొని ఉద్యోగాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు సోమవారం కలెక్టర్‌ను కలిశారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత, ఉమ్మడి వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం గౌరవ సంచాలకుడు జగన్ మోహన్, హనుమకొండ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి కృష్ణ, ఉద్యోగాలు సాధించిన రాజేందర్, రమేశ్, సునీల్, సంధ్య, రాకేశ్, రాజశేఖర్, మౌనిక, కిరణ్, సాంబమూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రావీణ్యతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి..

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం వీఆర్ఏల వారసులు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సతీశ్, యుగేంధర్ మాట్లాడుతూ.. జీవో నంబర్ 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడ్డ వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 20,555 మంది వారసులుండగా ఇందులో 16,758 మందికి గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. మిగిలిన 3,797 మందిలో జిల్లాలో సుమారు 90 మంది ఉంటారని వీరికి ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లింగస్వామి, సంపత్, తరాల రాజు, సునీల్‌కుమార్, సారంగ్, చైతన్య, తిరుపతి, శంకర్, సారయ్య, శ్రీనివాస్, కళాధర్, శ్రీను పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

నడికూడ, డిసెంబర్ 2 : కారు ఢీ కొట్టగా వ్యక్తి గాయపడిన ఘటన ధర్మారం గ్రామంలో సోమవారం జరిగింది. నడికూడ గ్రామానికి చెందిన గోనెల కుమారస్వామి తన ద్విచక్ర వాహనంపై ధర్మారం కూడలి నుంచి నడికూడకు వస్తుండగా హనుమకొండ నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు కాగా పరకాల హాస్పిటల్‌కు తరలించారు.

కులమతాల మధ్య చిచ్చుపెట్టడం సరికాదు

కాజీపేట, డిసెంబర్ 2 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య అన్నారు. సోమిడిలోని మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహిస్తున్న బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పట్టణంలోని కేవీపీఎస్ సభ్యులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. వర్ధంతి సభకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, జిల్లా కార్యదర్శి మంద సంపత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కారు ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పరకాల, డిసెంబర్ 2 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత (సక్సెస్) పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రోత్సహించాలి

దామెర, డిసెంబర్ 2 : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు ఎండీ రంజాన్ తాను పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్స్‌ను డీఆర్డీవో మేన శ్రీనుకు సోమవారం కార్యాలయంలో కలిసి అందజేశారు. డ్రాగన్‌ఫ్రూట్ పంట సాగుకోసం తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని వివరించారు. అనంతరం డీఆర్డీవో మాట్లాడుతూ..ఉపాధిహామీ పథకంలో అనేక పంటలను పండించొచ్చని, ఇందుకోసం రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో శారద పాల్గొన్నారు.

డీఆర్‌డీవోకు డ్రాగన్ ఫ్రూట్స్ అందజేస్తున్న రైతు రంజాన్

బాధితుడి సమస్యను వింటున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

- వివిధ సమస్యలపై 129 దరఖాస్తులు
- విజ్ఞప్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, డిసెంబర్ 2 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువలా వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు నుంచి అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్ విజ్ఞప్తులు స్వీకరించారు. కలెక్టరేట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కలెక్టరేట్, ఆర్డీవోలు, తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి రెవెన్యూ సమస్యలపై 60 విజ్ఞప్తులు వచ్చాయి. అలాగే జీడబ్ల్యూఎంసీవి 18, ఎంపీడీవోల ఆఫీసులవి 16, ఎంజీఎం 4, డీఈవో 3, డీపీవో 3, మైనారీ వెల్ఫేర్ 3, ఎన్పీడీసీఎల్ 4, మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి వచ్చాయి. డీఆర్డీవో శ్రీను, బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి, టూరిజం అధికారి శివాజీ, ఆర్డీవో నారాయణ పాల్గొన్నారు.

ధరణిలో పేరు కనిపించడం లేదు..

- తాళ్లపల్లి మొగిలి, పెంబర్తి, హసన్‌పర్తి

నాకు ఉన్న మొత్తం భూమి ధరణిలో కనిపించడం లేదు. నా పేరుపై 1.18 భూమి మా తాతల నాటి నుంచి వచ్చింది. సర్వే నంబర్ 235లో 12 గుంటలు, 182/బి/1లో 1.06ఎకరాలు ఉండాలి. భూమి పూర్తిగా కనిపించకపోవడంతో నాకు బ్యాంకు లోన్ రావడం లేదు. రుణ మాఫీ కావడం లేదు. రెండు, మూడు సంవత్సరాలుగా తిరుగుతున్నా సమస్య అలాగే ఉంది. భూమి మొత్తం ధరణిలో కనిపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దామెర, డిసెంబర్ 2 : మండలంలోని ఓగులాపురం గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకుడు మన్నెం రాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడి కుటుంబ సభ్యులను సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు సోమవారం పరామర్శించి ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో పలకల శ్రీనివాస్ రెడ్డి, సాంబశివారెడ్డి, మన్నెం ఇంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, రఘుపతి రెడ్డి, కేతిపల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

'9న ప్రజా భవన్ ముట్టడిస్తాం'

శాయంపేట, డిసెంబర్ 2 : గొల్ల,కుర్మలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని, ఈ నెల 9న ప్రజాభవన్ ముట్టడిని చేపడుతున్నట్లు గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోటు రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు డిప్యూటి తహసీల్దార్ ప్రభావతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 50 సంవత్సరాలు నిండిన గొర్ల కాపరులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, గొర్రెలకు ప్రభుత్వం ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నర్సయ్య, సహాయ కార్యదర్శి చిలుకల రాజన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, డిసెంబర్ 2 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 12గంటల వరకు విజయ్ పాల్‌రెడ్డి కాలనీ, ఫిల్టర్‌బెడ్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు అన్సారీ ట్రస్ట్, గాయత్రీనగర్, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 11గంటల వరకు యాదవనగర్, రెడ్డికాలనీ, పాచమ్మకుంట, డబ్బాలు, లోటస్‌కాలనీ, కుమార్‌పల్లి ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

బాధిత ఎస్సై కుటుంబానికి చెక్కు అందజేత

సుబేదారి, డిసెంబర్ 2 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేసి అనారోగ్యంతో చనిపోయిన ఎస్సై మొగిలి కుటుంబ సభ్యులకు రూ.16లక్షల విలువైన చెక్కును సీపీ అంబర్ కిశోర్ ఝా అందజేశారు. సోమవారం హనుమకొండలోని సీపీ కార్యాలయానికి సీపీ ఎస్సై కుటుంబ సభ్యులను పిలిపించి అందించారు.

కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతిగా వాసుదేవారెడ్డి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 2 : కాకతీయ విశ్వవిద్యాలయ కెమిస్ట్రీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ వాసుదేవారెడ్డిని నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వాసుదేవారెడ్డి ప్రస్తుత విభాగాధిపతి ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న నుంచి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈ పదవిలో 2సంవత్సరాలు కొనసాగుతారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వాసుదేవారెడ్డి

ముగిసిన రైల్వే ఎన్నికల ప్రచారం

- 4,5,6వ తేదీల్లో ఎన్నికలు..
- కాజీపేటలో ఐదు పోలింగ్ బూతులు.. 3 వేల మంది ఓటర్లు..

కాజీపేట, డిసెంబర్ 2 : రైల్వేలో జరిగే వన్ యూనియన్, వన్ ఇండస్ట్రీ గుర్తింపు ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగిసింది. దేశ వ్యాప్తంగా ఈ నెల 4, 5, 6వ తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. కాజీపేటలో రెండు నెలలుగా దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్ మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో 21 వేల ఓట్లు, కాజీపేట రైల్వే పరిధిలో 3 వేలకు పైగా ఓట్లు ఉన్నాయని నేతలు చెబుతున్నారు. కాజీపేటలో రైల్వే ఎన్నికల అధికారులు ఐదు బూత్‌లను ఏర్పాటు చేశారు. లోకో రన్నింగ్ స్టాఫ్ కార్మికులకు మాత్రం 6వ తేదీన కూడా ఓట్లు వేసేందుకు వీలు కల్పించారు. దేశ వ్యాప్తంగా ఈ గుర్తింపు ఎన్నికల్లో 24% శాతం ఓట్లు సంపాదించుకున్న యూనియన్‌కు గుర్తింపు వస్తుందని నేతలు అంటున్నారు.

మమతానగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త, నిల్వ ఉన్న మురుగు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పక్కా ప్రణాళికతో పట్టణాభివృద్ధి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల, డిసెంబర్ 2 : పక్కా ప్రణాళికతో పరకాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 10, 21వ వార్డుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరకాలలో డ్రైనేజీ, సీసీ నీటి సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు రూ.15కోట్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో పరకాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత-రామకృష్ణ, ఆర్డీవో నారాయణ, మున్సిపల్ కమిషనర్ సుష్మ పాల్గొన్నారు.